ప్రజాశక్తి
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 8 పేజీలు


గుంటూరు


పల్నాడు

జోరుగా జీరో వ్యాపారం!

మిర్చి యార్డు ఆదాయానికి గండి - భారీగా తరలివస్తున్న సరుకు - స్తంభించిన ట్రాఫిక్ - రైతులకు ఇబ్బందులు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డులో రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. దీంతో యార్డు పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. యార్డులో కాలు దీసి కాలు పెట్టేందుకు కూడా అవకాశం లేకుండాపోతోంది. గుంటూరు- చిలకలూరి పేట, గుంటూరు-సత్తెనపల్లి మార్గంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. యార్డుకు రోజుకు లక్షన్నర టిక్కీలు సరుకువస్తుండగా అధికారులు రికార్డులో తక్కువ సరుకు చూపిస్తూ జీరో వ్యాపారానికి తెరతీశారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. రైతుల నుంచి నేరుగా వ్యాపారులు అక్కడిక్కడే కొనుగోలు చేసి యార్డు రికార్డుల్లో నమోదు కాకుండా సరుకును బయటకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా కొంతమంది వ్యాపారులతో యార్డు అధికారులు కుమ్మక్కు అవుతున్నారు. కొంతమంది రైతులు వ్యాపారులు ఇచ్చే ధర నచ్చక తమ సరుకు కోల్డ్ స్టోరేజీలో పెట్టుకుంటామని చెబితే అందుకు కూడా అధికారులు కమీషన్ డిమాండ్ చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి.

యార్డులో భారీగా సరుకు వస్తున్నందు వల్ల తగిన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన యంత్రాంగం సందట్లో సడేమియా అంటూ అటు వ్యాపారుల నుంచి ఇటు రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనిపై విజిలెన్సు, నిఘా విభాగం అధికారులు దృష్టి సారించినట్టు తెలిసింది. యార్డుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గురువారం 1,28,837 టిక్కీలు వచ్చాయి. పాత నిల్వలతో కలిపి 1,23,214 టిక్కీలు అమ్ముడుపోయాయి. ఇంకా 1,15,034 టిక్కీలు నిల్వ ఉన్నాయి. సరుకు భారీగా వస్తుండటంతో ధరలను ఏమాత్రం పెంచకపోగా తగ్గిస్తున్నారు. గతేడాది ఇదే రోజుల్లో మిర్చి ధరలు గరిష్టంగా రూ.25 వేల నుంచి ▶ 2లో

సెలవు రోజుల్లోనూ మిర్చి విక్రయాలు జరపాలి


మిర్చి యార్డు ఛైర్మన్‌తో మాట్లాడుతున్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు మిర్చియార్డుకు మిర్చి అధికంగా వస్తున్నందున శని, ఆదివారాల్లోనూ విక్రయాలు చేపట్టాలని, ధరలు తగ్గకుండా చర్యలు తీసుకోవాలని రైతు సంఘం, కౌలురైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం, ఏపీ కౌలురైతు సంఘం రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం గురువారం గుంటూరు మిర్చియార్డును సందర్శించింది. రైతులతో నాయకులు మాట్లాడారు. మిర్చి ఎక్కువగా యార్డుకు రావటంతో ధర తగ్గించేశారని, శనివారం విక్రయాలు చేపట్టట్లేదని రైతులు తెలిపారు. ఇతర జిల్లాలు, దూరప్రాంతాల నుండి మిర్చిని విక్రయించుకోవటానికి వచ్చి, రెండు, మూడురోజులు ఇక్కడే ఉండాల్సి వస్తోందని వాపోయారు. అనంతరం నాయకులు, రైతులు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణను కలిసి సమస్యలను వివరించారు. మిర్చి రాక ఎక్కువగా ఉన్నందున శని, ఆదివారాల్లోనూ విక్రయాలు జరిగేలా చూడాలని కోరారు. తేజాకు రూ.20 వేలు ఉన్న క్వింటాళ్ ధర ఇప్పుడు రూ.16 వేలకు తగ్గించారని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ధరలు తగ్గకుండా చూడాలని కోరారు. స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ వ్యాపారులతో సమావేశం నిర్వహించి, ఆయా సమస్యలపై చర్చిస్తామన్నారు. ధరలు పడిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బృందంలో రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, అధ్యక్షులు వై.రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బి.రామకృష్ణ ఉన్నారు.



మెగా డీఎస్సీ కోసం

కాంగ్రెస్ చలో సెక్రటేరియేట్ ఉద్రిక్తం

- పిసిసి అధ్యక్షురాలు షర్మిల అరెస్టు
- సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు సంఘీభావం

వార్త మెయిన్‌లో

హామీలను విస్మరించి కేంద్రం మరో మోసం



నిరసన ప్రదర్శనలో ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రైతుల పోరాటం నేపథ్యంలో హర్యానా ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలకు పాల్పడి యువరైతు కరణ్‌సింగ్ మరో ఇద్దరు రైతులను పొట్టన పెట్టుకున్నాయని విమర్శించారు. దమనకాండను నిరసిస్తూ పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నుండి వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. యార్డు ఎదుట ధర్నా చేశారు. తొలుత కోటప్పకొండ రోడ్డులోని ప్రజా సంఘాల కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రామారావు అధ్యక్షత వహించారు. మృతి చెందిన రైతులకు సమావేశం సంతాపం తెలిపిన అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ గతంలో మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో 13 నెలల పాటు జరిగిన రైతు పోరాటానికి తలవంచిన కేంద్ర ప్రభుత్వం ఆ చట్టాలను వెనక్కు తీసుకుందని చెప్పారు. దీంతోపాటు రాతపూర్వకంగా కొన్ని హామీలిచ్చిందని, అయితే వాటిని అమలు చేయకుండా రైతులను మోసం చేయడంతో రైతులు మరోసారి ఉద్యమిస్తున్నారని అన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రధాని మోడీ ప్రకటించినా ఆచరణలో వ్యవసాయ రంగాన్ని మరింత నష్టాల్లోకి నెట్టారని, రైతులను కష్టాల పాల్జేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ఈ పదేళ్లలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైతులను రుణాల నుండి విముక్తులను చేయాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ఆపాలని కోరారు. వ్యవసాయాన్ని, రైతులను నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో ఈ ప్రధాని మోడీకి రైతులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సిఐటియు పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ ▶ 2లో


పురస్కారాలు అందుకుంటున్న లక్ష్మణరావు, మహేష్ రెడ్డి

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

లక్ష్మణరావు, మహేష్‌రెడ్డికి పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - తెనాలి

వైయస్సార్ నాటక కళాపరిషత్ జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం, ప్రఖ్యా చిల్డ్రన్స్ ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన ఆహ్వాన నాటిక పోటీల్లో భాగంగా చివరి రోజున కాకినాడకు చెందిన సాయి కార్తీక్ క్రియేషన్స్ ప్రదర్శన 'ఎడారిలో వాన చినుకు' సందేశాత్మకంగా సాగింది. పిల్లలు ఉండి, వారు ఉన్నత స్థాయికి ఎదిగి, దేశ విదేశాల్లో వారివారి పనుల్లో నిమగ్నమై సంపాదనే పరమావధిగా జీవిస్తూ, తల్లిదండ్రులను అనాథాశ్రమాలలో చేర్పించడం, జీవిత చరమాంకంలో బిడ్డల ▶ 2లో

వేధించిన వాలంటీర్ తొలగింపు 2లో

కొలిక్కిరాని మార్పులు

వైసిపిలో పెరుగుతున్న గందరగోళం

గుంటూరు లోక్‌సభకు తెరపైకి ఆర్కే పేరు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ స్థానాల్లో వైసిపి సమన్వయకర్తల మార్పు నిరంతర ప్రక్రియగా మారింది. సమన్వయకర్తల ఎంపిక, మార్పులు ప్రహసనంగా మారాయి. ఒక నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిని ప్రకటించిన తరువాత మళ్లీ మార్చడంతో కార్యకర్తల్లో తీవ్ర గందరగోళానికి దారితీస్తోంది. గుంటూరు లోక్‌సభ సమన్వయకర్తగా ఉమ్మారెడ్డి వెంకట రమణను ఎంపిక చేశారు. ఆయన చాలాకాలం తరువాత జిల్లా వచ్చారు. ఆయన్ను జిల్లా కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి జిల్లాలోని ముఖ్యనాయకులకు పరిచయం చేశారు. ఆ తరువాత ఆయన మళ్లీ ఎక్కడా కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. ఆయన్ను మారుస్తారని ప్రచారమైంది. గతంలో క్రికెటర్ అంబటి రాయుడు పార్టీలో చేరినకొద్ది రోజులకే నిష్క్రమించినట్టుగానే వెంకట రమణ కూడా పోటీకి ఆసక్తి చూపడం లేదని పార్టీ వర్గాల్లో ప్రచారమవుతోంది. తాజా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని గుంటూరు లోక్‌సభ సమన్వయకర్తగా ఎంపిక చేస్తారని గురువారం కొత్త ప్రచారం తెరపైకి వచ్చింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి అంగీకరించికపోతే పొన్నూరు ఎమ్మెల్యే కిలారి ▶ 2లో



డిఎస్‌సి పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి : మిగిలిపోయిన 1815 డిఎస్‌సి క్వాలిఫైడ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిఎస్‌సి 1998 అభ్యర్థులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు గురువారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు, వికలాంగులకు, మహిళలకు తీవ్ర అన్యాయం జరిగిందని వాపోయారు. ప్రస్తుత సిఎం ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్రలో తాము కలవడం జరిగిందన్నారు. అందరికీ న్యాయం చేస్తానని ఆయన ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. కొన్ని ప్రతికల్లో 5887 పోస్టులు భర్తీ చేసామని ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వడాన్ని ఖండించారు. ఇంకా 1815 పోస్టులు తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులు మోహనరావు, సుహాసిని, విశ్వరూపాచారి, నాగేశ్వరరావు, రమేష్, రామారావు, కోమలి పాల్గొన్నారు.

చంద్రబాబుకు రూ.50 కోట్లిచ్చి టిక్కెట్ తెచ్చుకున్న నరేంద్ర కుమార్ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : వైసిపి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో రూ.1600 కోట్లతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని, రూ.200 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మండలంలోని వెల్లలూరులో దాతల సహకారంతో నూతనంగా గ్రంధి ఆంజనేయులు జ్ఞాపకార్థం నిర్మించే శ్రీ షిరిడి సాయినాథ కళ్యాణ మండపానికి ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాపుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. సభకు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ వెంకటరమణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను అవినీతికి పాల్పడి రూ.2500 కోట్లు సంపాధించినట్లు మాజీ ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. గత 25 ఏళ్లుగా 650 ఎకరాల్లో గ్రావెల్, మైనింగ్ చేసింది నరేంద్ర కుమారేనని, చంద్రబాబుకు రూ.50 కోట్లిచ్చి టిక్కెట్ తెచ్చుకున్నారని ఆరోపించారు. సంఘం డెయిరీలో పాల ప్యాకెట్లు హెరిటేజ్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భవిష్యత్తును ఆరోపణలు చేసే నరేంద్ర కుమార్ నిరూపించటానికి ధైర్యం ఉండాలన్నారు. స్థానిక నాయకులు బి.బాబు మాట్లాడుతూ గ్రామాల్లో గ్రూపు తగాదాలు పెట్టి, గొడవలను ప్రోత్సహించింది టిడిపి అన్నారు. ఈ సందర్భంగా ములుకుదురు బాలాజీ, మరికొన్ని కుటుంబాలు వైసిపిలో చేరాయి. సర్పంచ్ ఐ.మల్లికార్జునరావు, మాజీ జెడ్పీటీజీ కె.శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ ఎ.వెంకటే శ్వరరావు, జిడిసిఎంఎస్ డైరెక్టర్ కె.పాములు పాల్గొన్నారు.

జోరుగా జీరో వ్యాపారం!

(మొదటి పేజీ తరువాయి)

రూ.27 వేల వరకు ఉన్నాయి. ప్రస్తుతం మేలురకం తేజ, బాడిగ రకాలు కనిష్టంగా రూ.8,500 ఉండగా గరిష్టంగా రూ.21 వేలు పలికాయి. సాధారణ రకాల ధరలు కనిష్టంగా రూ.9 వేలు పలకగా గరిష్టంగా రూ.20,500 మాత్రమే పలికాయి. 334 గరిష్ట ధర క్వింటాళ్ రూ.20,500, నెంబరు.5 రూ.20 వేలు, 273 గరిష్టంగా రూ.16,800, 341 రూ.20,500, సూపర్ 10 రూ.16,500కి ధర పలికింది. గత నెల రోజుల కాలంలో సరుకు ఎక్కువ వచ్చిన రోజున ధరలు తగ్గించడం, సరుకు తక్కువగా వచ్చిన రోజు సగటు ధర స్వల్పంగా పెంచడం వ్యాపారులకు పరిపాటిగా మారింది. ఏ వెరయిటీ కూడా గరిష్టంగా రూ. 21 వేలు దాటిన పరిస్థితి లేదు.ఇళ్లల్లో నిల్వ చేసుకోలేమని, కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకున్నా ప్రస్తుతం అప్పులు తీర్చడానికి డబ్బు అవసరమని రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారు.

ప్రతి బుధవారం సెలవు

మిర్చి సీజన్‌లో రద్దీ ఎక్కువగా ఉన్నందున ఇక మీదట ప్రతి బుధవారం సెలవు ఇస్తున్నట్టు యార్డు కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయంను దృష్టిలో పెట్టుకుని వ్యాపారులు, ఉద్యోగులు, కమీషన్ ఏజెంట్లతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లోనే యార్డుకు సరుకు తేవాలని కోరారు.

కార్మికునికి వైద్యం కోసం ధర్నా



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మున్సిపల్ కార్మికుడు డేరంగి కోటయ్య విధుల్లో ఉండగా మున్సిపల్ చెత్త తరలింపు ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడని, అతనికి మెరుగైన వైద్యం కోసం మున్సిపాల్టీ బాధ్యత తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం బైటాయించారు. యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.సాల్మన్ మాట్లాడుతూ ఈ నెల 17న ప్రమాదానికి గురైన కార్మికుడు కోటయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరుకు తరలించారని, మంగళవారం వరకూ హాస్పిటల్ ఖర్చులు భరించిన మున్సిపల్ అధికారులు చేతులెత్తయడంతో బుధవారం చికిత్స అందలేదని, మరో హాస్పిటల్‌కు తరలించారని అన్నారు. కార్మికుని వైద్యం పట్ల మున్సిపల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ధర్నా నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ సూపర్వైజర్ వెంకటేశ్వర్లు స్పందించి ఆందోళనకార్లతో మాట్లాడారు. చికిత్సకు మున్సిపల్ నిధుల నుండి ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. క్షతగాత్రునికి భార్య, ఇద్దరు కుమారులున్నారని, కోటయ్యే ఆ కుటుంబానికి ఆధారమని, ఆయన పూర్తిగా కోలుకునే వరకూ మున్సిపాల్టీ బాధ్యత తీసుకోవాలని కార్మికులు కోరారు. కార్యక్రమంలో కార్మికులు మల్లయ్య, పి.ఏసు, ఏసురత్నం పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని ఆవిష్కరించిన కలెక్టర్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

రాజ్యాంగం లోని అంశాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గురువారం కలెక్టర్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రచించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కె.ఎస్ మాట్లాడుతూ బావి భారత పౌరులకు భారత రాజ్యాంగం పట్ల, అందులోని అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో రచించిన పుస్తకాన్ని పాఠశాల, కళాశాల విద్యార్థిని విద్యార్థులు తప్పకుండా



చదవాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలతో పాటు రచన కమిటీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన అమూల్యమైన కృషిని పుస్తకంలో ప్రస్తావించామన్నారు. భారత రాజ్యాంగం పట్ల విద్యార్థుల్లో మరింత విశ్వాసం నమ్మకం పెంపొందించడమే లక్ష్యంగా ఈ పుస్తకాన్ని రచించానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి పాల్గొన్నారు.

రెండ్రోజుల్లో మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకటన

తాడేపల్లి వైసిపి పట్టణ, రూరల్ కార్యాలయం ప్రారంభంలో ఎంపీ విజయసాయిరెడ్డి



ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని క్రిష్టియన్‌పేటలో ఏర్పాటు చేసిన వైసిపి తాడేపల్లి పట్టణ, రూరల్ పార్టీ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు మనుమంతరావు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంజి చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, జూపూడి ప్రభాకర్‌లతో కలిసి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆర్కే తిరిగి పార్టీలోకి రావడం సంతోషకరంగా ఉందన్నారు. గత రెండుసార్లు ఆర్‌కెకు మద్దతిచ్చిన విధంగానే బీసీ అభ్యర్థికి కూడా ఇవ్వాలన్నారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలు అందరికీ అందుబాటులో ఉంటాయన్నారు. మరో రెండు రోజుల్లో బీసీ అభ్యర్థిని ప్రకటిస్తామని తెలిపారు. మంగళగిరి నియోజకవర్గ నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా త్వరలో నిర్వహిస్తామని, ఇప్పటికే మూడు వేల మందికి పైగా నిరుద్యోగ యువతని గుర్తించామని చెప్పారు. దుగ్గిరాల ప్రాంతంలో రోడ్లు మరమ్మతులు, సైడ్ కాల్వలను పూర్తి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చేసిన ద్రోహం ప్రజలందరూ మర్చిపోలేదన్నారు. ఆర్థికంగా సామాజికంగా ప్రజలకు తోడుగా నిలబడింది జగన్మోహన్ రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.వేమారెడ్డి, బి.వేణుగోపాలసోమిరెడ్డి, ఎం.వివేకానందరెడ్డి, డి.రామకృష్ణారెడ్డి, ఇ.డేవిడ్‌రాజు, ఎం.అంజిరెడ్డి, రత్నకుమారి, జి.బాబు, ఎం.అబ్బు పాల్గొన్నారు.

వేధించిన వాలంటీర్ తొలగింపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : నరసరావుపేట మండలం పాలపాడులో విద్యార్థినిని వేధించిన ఘటనలో వాలంటీర్ పిట్టు శ్రీకాంత్‌రెడ్డిని విధుల నుండి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వాలంటీర్ వేధింపులు తాళలేక 9వ తరగతి విద్యార్థిని ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. దీనిపై కేసు నమోదు కావడంతో వాలంటీర్‌పై చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా బాధిత బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కొలిక్కిరాని మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

రోశయ్యకు బాధ్యతలు అప్పగిస్తారని కూడా చెబుతున్నారు. మంగళగిరి ఇన్‌చార్జిగా ఉన్న గంజి చిరంజీవి మార్పుపై ఉత్కంఠ నెలకొంది. ఆయన స్థానంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల లేదా ఆమె కుమార్తె లావణ్యను ఎంపిక చేస్తారని తెలిసింది. తెనాలి సీటు వైసిపికి కొంత ఆశాజనకంగా ఉంటుందని సర్వేల్లో వెల్లడయిందని తొలుత సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మార్పుపై దృష్టి సారించలేదు. అయితే ఆకస్మికంగా సినీ నిర్మాత దాసరి కిరణ్ తెనాలి స్థానం కోరడంతో శివకుమార్‌ను పొన్నూరు వెళ్లాలని పార్టీ అధిష్టానం ఆదేశించడంతో ఆయన ససేమిరా అంటున్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు టిక్కెట్ విషయంపై ఇంకా స్పష్టత లేదు. వెంకట రమణ స్థానంలో లోక్‌సభకు అవకాశం ఇస్తే సరే లేదంటే ఆయనకు మొండిచేయి చూపే అవకాశం ఉందని పార్టీలో ఆయన వ్యతిరేక గ్రూపు ప్రచారం చేస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం పొన్నూరు మండలం వెల్లలూరులో కాపుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు లోక్‌సభకు తన కుమారుడు వెంకటరమణ, పొన్నూరుకు తన అల్లుడు ఎమ్మెల్యే రోశయ్య పేర్లు ప్రస్తావించకుండా మనం అంతా ఐక్యంగా ఉండి వైసిపిని గెలిపించుకుని, వైఎస్ జగన్‌ను మరోసారి సిఎం చేసుకోవాలని అన్నారు.

తాజాగా ఆళ్ల రామకృష్ణారెడ్డికి సత్తెనపల్లి నుంచి పోటీ చేయాలని కోరినట్టు తెలిసింది, సత్తెనపల్లిలో ప్రాతినిధ్యం వహిస్తున్న అంబటి రాంబాబును బందరు లోక్‌సభకు పంపుతారని తెలుస్తోంది. లేదంటే ఆయనకు పొన్నూరు నుంచి అవకాశం కల్పిస్తారని తెలిసింది. పెదకూరపాడులో టిడిపి అభ్యర్థిగా భాష్యం ప్రవీణ్‌ను ఎంపికచేస్తారని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. భాష్యం ప్రవీణ్ వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు అల్లుడు కావడం వల్ల ఈ ప్రభావం ఎన్నికల్లో ఎంత ప్రభావం ఉంటుందోనని వైసిపి అధిష్టానం సర్వే చేస్తున్నట్టు తెలిసింది. ఇప్పటి వరకు శంకరరావుకు సానుకూలత ఎక్కువగా ఉందని భావించిన అధిష్టానం టిడిపి అభ్యర్థిని బట్టి ఇక్కడ కూడా మార్పునకు ప్రయత్నించే అవకాశం లేకపోలేదంటున్నారు. సామాజిక అంశాల ఆధారంగా ప్రత్తిపాడు సమన్వయకర్త బాలసాని కిరణ్ మార్పుపై కూడా దృష్టి సారించినట్టు చెబుతున్నారు.

ముగిసిన ఆహ్వాన నాటిక పోటీలు

(మొదటి పేజీ తరువాయి)

కడసారి చూపు కోసం తల్లిదండ్రులు తపించే తీరు ప్రేక్షకులను కంటతడి పెట్టించింది. నాటిక పోటీల ముగింపు సభకు ఎమ్మెల్యే ఎ.శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళలకు, కళాకారులకు తెనాలి నిలయమని, ప్రతి ఏటా కళాకారులను ప్రోత్సహించేందుకు నాటకోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా వైసిపి పట్టణ యువజన విభాగం అధ్యక్షులు కుడుముల మహేష్‌రెడ్డి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత లక్కరాజు లక్ష్మీనారాయణను వైయస్సార్ అచీవ్మెంట్ పురస్కారంతో సత్కరించారు. నాటిక ప్రదర్శనలను ఆరాధ్యుల కన్నా, జి.సుబ్బారావు, లక్కరాజు లక్ష్మణ్‌రావు, కొండపి శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, గంపల శివనాగేశ్వరరావు, బి.భాస్కరరావు, కళాకారులు పాల్గొన్నారు.


హామీలను విస్మరించి కేంద్రం మరో మోసం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ పరం చేసేందుకు జరిగే కుట్రలో భాగంగానే పంటలకు మద్దతు ధరలు దక్కకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని చెప్పారు. విత్తనం దగ్గర నుండి పంట కొనుగోలు వరకు అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారానే జరుగుతాయని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. రైతు భరోసా కేంద్రాలు ఉత్సవ విగ్రహాలుగా పడి ఉన్నాయన్నారు. ఇదిలా ఉండగా మీడియాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండిస్తూ తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.గోపాలరావు, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకులు కె.ఏడుకొండలు, పీడీఎం నాయకులు ఎన్.రామారావు, సిఐటియు నాయకులుషేక్ సిలార్ మసూద్, కౌలు రైతు నాయకులు కె.ఆంజనేయులు, ముస్లిమ్ జేఏసీ నాయకులు జిలాని పాల్గొన్నారు.

వాలంటీర్లకు సత్కారం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి : గుంటూరు 32వ డివిజన్‌లో గురువారం వాలంటీర్లకు సన్మానం జరిగింది. బ్రాడీపేట 2/11 లోని 127వ నెంబర్ సచివాలయం వద్ద 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో వాలంటీర్లను గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బి.రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ బి.దేవానంద్, గీతా మందిరం ఛైర్మన్ వి.రత్నప్రసాద్ సత్కరించారు. కార్పొరేటర్ ఆచారి మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే వచ్చి నిస్వార్థంగా అన్ని రకాల సేవలను అందుబాటులోకి తెచ్చిన వాలంటీర్లపై పలువురు స్వార్థ రాజకీయ నేతలు నీచమైన వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. వాలంటీర్ల నిస్వార్థ సేవను ప్రజలంతా అభినందిస్తుంటే కొన్నిపార్టీలు అసూయతో విమర్శలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వి.వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



అనుమానాస్పదస్థితిలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-నూజెండ్ల

మండలంలోని జంగాలపల్లిలో మాసిపొగు మరియదాసు(40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు, స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఐనవోలు ఎస్సై లక్ష్మి నారాయణరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరి శీలించారు. మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని ఎస్సై నారాయణ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సాగర్‌కుడి కాలువ గట్టు వద్ద..

ప్రజాశక్తి-ఈపూరు

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని అగ్నిగుండల సమీపంలోని నాగార్జునసాగర్ కుడి కాలువ కట్ట వద్ద జరిగింది.బొల్లాపల్లి మండలం మాలపాడు తండాకు చెందిన భూక్య తులసి నాయక్, మరో ఇద్దరు వ్యక్తులు అగ్నిగుండాల గ్రామ సమీపంలో పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. ఈ నెల 21 న మాలపాడు నుండి పొలం పనులకు వచ్చిన తులసి నాయక్ (48) ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతుక సాగారు. కాల్వ కట్టపై గుంతలో వ్యక్తి పడి ఉండడాన్ని బాటసారులు గమనించారు. ఈ క్రమంలో తులసినాయక్ కుటుంబసభ్యులకు ఈ సమాచారం తెలిసింది. సంఘటనా స్థలానికి ఆయన కుటుంబసభ్యులు వెళ్లి పరిశీలించగా తులసి నాయక్ అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నాడు. తులసి నాయక్ శరీరంపై గాయాలు, చేతి వేలు కట్ చేసి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు ఎవరైనా హత్య చేసి పడేశారా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారంతో ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ సంఘటన ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు.



జంగాలపల్లిలో సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మి నారాయణరెడ్డి



బస్సు లేక విద్యార్థుల అవస్థలు

ప్రజాశక్తి-నూజెండ్ల

మండల పరిధిలోని గొల్లపాలెం, తలార్లపల్లి, దాట్లవారిపాలెం,కమ్మవారిపాలెం గ్రామాల నుండి సుమా రుగా 70 మంది విద్యార్థులు ప్రతిరోజు నూజెండ్లలోని ఉన్నత పాఠశాలకు రోజూ అటోలపై వేళ్లాడుతూ ప్రయాణిస్తున్నారు, గత ఇరవై ఏళ్లుగా ఆయా గ్రామాలకు బస్సు సదుపాయం లేదు, దీనిపై గతంలో అధికారులను సంప్రదించిన ఎటువంటి చర్యలు తీసుకోలేదు, విద్యార్థులకు పరీక్షల సమయం కనుక స్థానిక నేతలు అధికారులు ఈ సమస్యపై దృష్టి సారిం చాల్సిందిగా ప్రజలు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

ప్రజాశక్తి-తాడికొండ

మహిళ మెడలో బంగారు గొలుసును అపహరించిన ఘటన మండల పరిధిలోని దామరపల్లిలో గురువారం చోటు చేసుకుంది. సిఐ ప్రభాకర్ రావు వివరాల ప్రకారం దామరపల్లికి చెందిన వట్టికూటి సీతమ్మ, రేగి పళ్ళు అమ్ముకొని జీవనం సాగిస్తుంటుంది. రోజు మాదిరిగానే సర్పంచ్ నల్లిపోయిన సరస్వతి ఇంటి వద్ద రేగి పళ్ళు అమ్ముకుంటోంది. గుర్తుతెలియని ముగ్గురు యువకులు తమకు రేగి పళ్ళు కావాలంటూ బేరం చేస్తూ.. ఆ ముగ్గురిలో ఒకరు ఆమె చేతులను వెనుకకు లాగారు. మరొకరు ఆమె నోరు మూశారు. మెడలో ఉన్న రెండు సవర్ల బంగారు గొలుసును అపహరించి బైకుపై పరారాయ్యారు. సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సిఐ తెలిపారు

రాష్ట్రంలో కానరాని అభివృద్ధి: టిడిపి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రాష్ట్రంలో విధ్వంసం తప్ప అభివృద్ధి కానరావడం లేదని సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ విమర్శిచారు. సత్తెనపల్లి పట్టణంలోని 3వ వార్డులో గురువారం రాత్రి నిర్వ హించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరి పాలన స్వర్ణ యుగం ఎవరి పాలన రాతియుగము త్వరలోనే ప్రజలు తగు బుద్ధి చెబుతారని అన్నారు. పట్టణంలో కొంచెం కూడా అభివృద్ధి జరగలేదని అన్నారు. తెలుగుదేశం జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తానని అన్నారు.



సత్తెనపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు తాతా జయ ప్రకాష్ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు ఆతుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందించారు. ఈ సందర్భగా మండలంలోని పొడ పాడులో గురువారం ఓ కార్యక్రమం నిర్వ హిం చారు. సర్పంచ్ రూపలక్ష్మి హనుమంతరావు, ఫౌం డేషన్ ప్రతినిధులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కె. ప్రసాదు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు నూతన పాలకవకర్గం ప్రమాణస్వీకారం



ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో చైర్మన్, నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం అటహాసంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. యార్డు చైర్మన్‌గా ఉప్పలపాడుకు చెందిన శనివారపు వాసుదేవరెడ్డి, వైస్ చైర్మన్‌గా అర్వపల్లికి చెందిన పులుసు అన్నపూర్ణమ్మ, మిగతా పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ యార్డుకు త్వరలోనే భవనాన్ని నిర్మిస్తామన్నారు. రైతుల కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం కృషి చేస్తున్నారని, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చామని చెప్పారు. పంటకు మద్దతు ధరలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని, వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసిపి శ్రేణులు భారీగా హాజరయ్యారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	: 1,28,837
మిర్చి ఎగుమతి	: 1,23,214
మిర్చి నిల్వ	: 1,15,034

మిర్చి ధరలు

రూపాయలలో

334	9,000 - 20,500
నెం.5	13,500 - 20,000
273	12,500 - 16,800
341	10,200 - 20,500
4884	13,500 - 19,500
సూపర్ 10	15,000 - 16,500
	నాన్ ఎసి
తేజ	8,500 - 21,000
బడిగి	9,000 - 20,500
దేవనూరు డీలక్స్	11,500 - 20,500
తాలుకాయలు	5,000 - 13,000

వైసిపి గెలుపునకు కృషి : ముస్తాఫా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్ని పార్టీలు కలిసినా వైసిపి గెలుపును ఎవ్వరూ ఆపలేరని ఎమ్మెల్యే ముస్తాఫా అన్నారు. తూర్పు నియోజకవర్గంలో గురువారం ఎన్నికలకు సిద్ధం అంటూ 53వ డివిజన్‌లో నియోజకవర్గం సమన్వయకర్త నూరి ఫాతిమాతో కలసి పర్యటించారు. రానున్న ఎన్నికల్లో తూర్పు నియోజక వర్గం నుంచి తన కుమార్తె నూరి ఫాతిమాను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఎన్నో అభి వృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామని, కొన్ని చివరిదశలో ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిని మళ్లీ అధికారంలోకి రాగానే పూర్తిచేస్తా మన్నారు. నూరిఫాతిమా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క రికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, టిడిపి గెలిస్తే సంక్షేమ పథకాలు అమలు కావని అన్నారు.



డివిజన్‌లో పర్యటిస్తున్న నూరి ఫాతిమా

పక్కా ప్రణాళికతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లోక్‌సభ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒక ప్రణాళికతో కృషి చేస్తానని టిడిపి నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో జరిగిన స్థానిక వైద్యుల ఆత్మీయ కలయిక కార్యక్రమానికి గురువారం సాయంత్రం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ తన కంటే ఇక్కడున్న డాక్టర్లు ఎంతో గొప్పవారని, తాను 20 ఏళ్లలో అమెరికాలో ఉన్నా తనను ఏ ఒక్కడూ లంచం అడగలేదని, కానీ ఎన్నో ఒత్తిళ్ళ మధ్య, అవినీతి మధ్య నలిగిపోతున్న ఇక్కడి డాక్టర్లు ఆ ఒత్తిళ్లను అధిగమించి మరీ వైద్యం చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ కి సంబంధించి కోట్లాది రూపాయల బిల్లులు పెండింగులు పడుతున్నా, వైద్యం ఆపడం లేదన్నారు. చాలామంది తనను ఎన్ఆర్ఐ అంటున్నారని, తన నేలపై ఉన్న మమకారం కొద్దీ తాను ఇంతవరకు తన పాస్‌పోర్ట్ కూడా మార్చుకోలేదన్నారు. మూడు రాజధానుల నినాదం కార్యరూపం దాల్చదన్నారు. జగన్ లాంటి వ్యక్తితో పోలిస్తే పవన్ కళ్యాణ్ వేలరెట్లు గొప్ప వ్యక్తి అన్నారు. టిడిపి కష్టకాలంలో ఉంటే రోడ్లపైకి వచ్చి పోరాడిన వ్యక్తి పవనని ఆయన కితాబిచ్చారు. చిన్నతనం నుంచి విప్లవాత్మకమైన భావాలతో పెరిగిన పవన్ అంటే వ్యక్తిగతంగా తనకు చాలా అభిమానమని ఆయన ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్



పట్టణంలోని 8, 9, 11, 12 వార్డుల్లో పారిశుధ్య సమస్య నెలకొందని టిడిపి నాయకులు జె.సుదీర్ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నయీమ్ అమ్మద్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. కొద్ది రోజులుగా తాగునీరు కూడా సరిగా సరఫరా కావడం లేదని, మూడ్రోజులకోసారి సరఫరా అవుతున్నా అవి సరిపడక ఇబ్బం దులు పడుతున్నారని చెప్పారు. దోమల ఉధృతితో పలువురు విష జ్వరాల బారిన పడుతున్నారన్నారు. వీటిపై సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు.


రెంటచింతల


మాచర్ల

పుల్లరి ఉద్యమ యోధుడు కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళి

ప్రజాశక్తి - రెంటచింతల

బ్రిటిష్ వారి తూటాలకు ఎదురొడ్డి పోరాడిన ధీరశాలి కన్నెగంటి హనుమంతు అని గిరిజన సంక్షేమ గురుకులం ప్రిన్సిపల్ ఎ.మోహన్ అన్నారు. కన్నెగంటి హనుమంతు 102 వర్ధంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రమైన రెంటచింతలలో ప్రదర్శన చేశారు. హనుమంతు గొప్పతనాన్ని కీర్తిస్తూ పాటల రూపంలో బ్యాండ్ మేళాలతో విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో పుల్లరి ఉద్యమాన్ని నడిపిన యోధుడుని, ఆయన త్యాగాలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.పుష్పవతి రామయ్య, ఎన్.సత్యనారాయణ, సైదయ్య, మర్రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మాచర్ల

స్వాతంత్ర సమరయోధుడు, పుల్లరి ఉద్యమకారుడు కన్నెగంటి హనుమంతు 102 వ వర్ధంతిని మాచర్ల పట్టణంలో జరిగింది. ముఖ్య అతిథులుగా మాచర్ల మున్సిపల్ చైర్మన్ ఎం.చిన్నఏసోబు, వైసిపి సీనియర్ నాయకులు మరుమాముల శ్రీనివాస శర్మ హాజరయ్యారు. పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో గల కన్నెగంటి హనుమంతు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అతిథులు మాట్లాడుతూ కన్నెగంటి హనుమంతు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి పుల్లరీ ఉద్యమాన్ని నడిపి, మన దేశ ప్రజల కోసం బ్రిటిష్ వారి చేతిలో తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహానుభావుడు అని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ టి.వెంకటేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆర్.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, ఎం.సంతోష్, వై.శ్రీనివాసరావు, బి.ఏడుకొండలు, దస్తగిరి, రాధా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుర్గి

స్థానిక బస్టాండ్ సెంటర్లోని విగ్రహానికి టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, ఇతర టిడిపి నాయకులు పూలమాలలేసి నివాళు లర్పించారు. అనంతరం కొలగుట్ల సమీపంలోని హనుమంతు సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు



గీతమ్స్ జూనియర్ కాలేజీలో ఘనంగా ఫేర్‌వెల్‌డే

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని గీతమ్స్ మహిళా జూనియర్ కాలేజీలో బుధవారం రాత్రి ఇంటర్మీడియట్ విద్యార్థినుల ఫేర్వెల్ డే వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథులుగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, రవీంద్ర హైస్కూల్ షేక్ సుభాని హాజరయ్యారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత చదువులు, మంచి ఉద్యోగం సాధించ డానికి పాటించాల్సిన పద్ధతులపై సూచనలు చేశారు. పట్టుదల, క్రమశిక్షణే ఉన్నత స్థితికి చేరుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



అబ్బూరులో అంగన్వాడీల ర్యాలీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భేటీ బచావో భేటీ పడావోలో భాగంగా మండలంలోని అబ్బూరులో అంగన్వాడీలు బుధవారం ర్యాలీ చేశారు. ర్యాలీని సర్పంచ్ జి.అన్నపూర్ణమ్మ ప్రారంభించి మాట్లాడారు. బాల్యవివాహాలు అనర్థదాయకమని, మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలనూ పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ షేక్ ఆషా, మహిళా కార్యదర్శి రాణి, టీచర్లు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన దిశ డీఎస్పీ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా



దిశా పోలీస్ స్టేషన్ పల్నాడు డీఎస్పీగా ఎం.సుధాకరరావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం ఆయన జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సుధాకరరావు గతంలో ఒంగోలు పిటిసిలో డీఎస్పీగా పనిచేస్తూ ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా పల్నాడు జిల్లా దిశ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. మహిళలపై నేరాలను నియంత్రించాలని, ఫోక్సో కేసుల విచారణను త్వరగా పూర్తిచేసి నిందితులకు శిక్ష పడేలా చేసి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ సూచించారు.

మిర్చిలో 7.5 క్వింటాళ్ల దిగుబడి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని తుమృకోటలో గురువారం మిర్చి పంట కోత ప్రయోగం నిర్వహించారు. రమాదేవికి చెందిన కళ్లంలో ఐదు మీటర్ల విస్తీర్ణంలో తొలి కోత ప్రయోగం నిర్వహించగా ఎకరాకు మిర్చి 7.5 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నట్లు తేలిందని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో విఎఎ శ్రీలత, రైతులు పాల్గొన్నారు.





వ్యాధుల నివారణపై అవగాహనకు కళాజాతా

ప్రజాశక్తి - వినుకొండ

రక్తదానం, ఎయిడ్స్, క్షయ ఇతర వ్యాధుల నివారణపై అవగాహన కోసం జిల్లాలో చేపట్టిన కళాజాతా గురువారం వినుకొండలో పర్యటించింది. శివయ్య స్తూపం, బస్టాండ్, లక్ష్మీహాల్ సెంటర్లలో పాటలు, నాటికల ద్వారా అవగాహన కల్పించారు. బాధితుల పట్ల వివక్ష చూపకూడదని, వారు దాన్నుండి బయటపడేలా సహకరించాలని కోరారు. వివరాలేమైనా కావాలంటే స్థానిక ఏనుగుపాలెం రోడ్డులోని రైల్వేగేటు సమీపంలో ఉన్న హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టిఐ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాబృందం వి.మల్లికార్జునరావు, హాండ్స్ అఫ్ కంపాషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆనంద్ బెంజమిన్, ప్రభుత్వాస్పత్రి కౌన్సిలర్ సురేష్, ల్యాబ్ టెక్నిషియన్ రోజా, ప్రాజెక్ట్ మేనేజర్ ఉదయరాజు, సిబ్బంది కొండలు, రిబ్కా, జక్రయ, రాజు, రహ్మాత పాల్గొన్నారు.



కంటి వైద్యశాలను ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని చిన్న మసీద్ సెంటర్, శ్రీ చైతన్య స్కూల్ ప్రక్కన అత్యాధునిక కంటి పరికరాలతో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కోట సైదయ్య నేత్రాలయాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ గురువారం ప్రారంభించారు. అనంతరం ఆప్టికల్, ఫార్మసిని ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ ప్రారంభించగా ఓపీ రూమ్‌ను జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ రవి ప్రారంభించారు. ఆపరేషన్ థియేటర్‌ను డాక్టర్ రామ లింగారెడ్డి, స్కాన్ రూమ్‌ను డాక్టర్ పి.సుధాకర్ ప్రారంభించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని డాక్టర్ ఆళ్ల స్థిమితతో చెప్పారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు



ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణ, పరిసర ప్రాంతాల్లో ప్రాంతాల్లో ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు వాహనదార్లకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. గణపవరం సెంటర్ మొదలు ఎన్‌ఆర్‌టి సెంటర్, విజయ బ్యాంక్, అడ్డరోడ్డు వరకు ప్రధాన కూడళ్లలో భారీ ఫ్లెక్సీలు పెట్టడం వల్ల అటుగా వచ్చిపోయే వాహనదార్లకు ఒకరికొకరు సరిగా కనిపించడం లేదు. విజయ బ్యాంక్ వద్ద పలుమార్లు ప్రమాదాలు వాటిల్లగా పలువురు ప్రాణాలనూ పోగొట్టుకున్నారు. బస్సులు రాకపోకల సందర్భంలో అక్కడ ఆగుతుంటాయి. విద్యార్థులు, ప్రయాణికులు, కూలీ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లి వచ్చేవారికితో ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. అయినా ఇక్కడ భారీ ఫ్లెక్సీల ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు దాటే వారికి అవతలి నుండి వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బంది పడుతున్నారు. ఎన్‌ఆర్‌టి సెంటర్లో ఫ్లెక్సీలతోనూ ఇదే చిక్కు. ఈ మార్గంలో ఇతర రాష్ట్రాల నుండి కూడా వాహనాలు వస్తుంటాయి. ఇతర ప్రాంతాలకు ఏ మార్గంలో వెళ్లాలో తెలిసే సూచిక బోర్డులకు అడ్డుగా భారీ ఫ్లెక్సీలు పెట్టారు. దీంతో సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారు కొన్ని సందర్భాల్లో ఇక్కడున్న నాలుగు మార్గాల్లో ఎటు వెళ్లాలో తెలియక అవస్థ పడుతున్నారు. ఇతరులను



అడగాలన్నా వారికి భాష సరిగా రాక ఇబ్బందులకు గురౌతున్నారు. అడ్డ రోడ్డు సెంటర్, ఎఎంజి గణపవరం, వద్ద కూడా ఇదే పరిస్థితులు నెలకొన్నాయి. అసలే జాతీయ రహదారి కావటంతో ప్రమాదాలకు మరింత ఎక్కువగా అవకాశం ఏర్పడుతోంది. ఈ ఫ్లెక్సీల్లో ఎక్కువ భాగం అధికార పార్టీవే. అయితే అధికారులు ఇవన్నీ పట్టించుకోవడం లేదని, ట్రాఫిక్‌పైనా సరైన శ్రద్ధ పెట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రజాశక్తి
గుంటూరు 5
శుక్రవారం 23 ఫిబ్రవరి 2024


అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పరిష్కరించకుంటే 27న సబ్‌కలెక్టర్ ఆఫీసు వద్ద ఆందోళన

ప్రజాశక్తి - దుగ్గిరాల

ప్రమాదం జరిగి నెల రోజులు అయినప్పటికీ యాజమాన్యం నుండి ఎటువంటి స్పందన లేదని పసుపు రైతు సంఘ రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకర్ విమర్శించారు. గురువారం శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ వద్ద జనవరి 19వ తేదీన అగ్ని ప్రమాదంలో పసుపు పంట నష్టపోయిన రైతులు పసుపు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో జొన్నా శివశంకర్ మాట్లాడుతు రైతులకు ఇప్పటివరకు ఎటువంటి పరిహారం చెల్లించలేదని విమర్శించారు. ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేసిందని, అయినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పందన లేదన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రస్తుత పసుపుధర క్వింటా రూ.11,750 ఉందని, ఈ రేటు ప్రకారమే యాజమాన్యం నష్టపోయిన పసుపు రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వెంటనే యజమానికి రైతుల సమావేశం ఏర్పాటు చేసి రైతుల ఎకౌంటులో ఇన్సూరెన్స్ డబ్బు వ్యత్యాసం ఉన్న డబ్బు యజమాని చెల్లించే విధంగా అగ్రిమెంటు చేయించి ప్రభుత్వం అందించే సహాయం ధరల స్థిరీకరణ నిధి నుండి గాని ప్రకృతి విపత్తుల సహాయ నిధి నుండి గాని రైతులకు సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 27 తేదీన రైతులను సమీకరించి తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. మాజీ శాసనసభ్యులు ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజ్ లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఆర్పే పరికరాలు ఉన్నాయో లేదో విచారణ జరపాలన్నారు లేకపోయినట్లయితే యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు పెరిగిన ధరల ప్రకారం బీమా ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దాదాపు 600 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కోల్డ్ స్టోరేజీ లో జరిగిన అవకతవకలను బయపెట్టి, తక్షణమే రైతుల జాబితా ప్రకటించాలని కోరారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సూర్యనారాయణ మాట్లాడుతూ రైతులంతా రాజకీయాలకు అతీతంగా నష్టపరిహారం కోసం ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొని పోరాడాలన్నారు. పంజాబ్ రాష్ట్ర రైతులు ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వం పై పోరాడుతున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బాపట్ల జిల్లా రైతు సంఘ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా లో కోల్డ్ స్టోరేజ్ యజమానిని పిలిపించేంతవరకు అక్కడి నుండి కదిలేది లేదన్నారు. రైతులందరికీ న్యాయం జరగాలని ప్రస్తుత ధరల ప్రకారం


మాట్లాడుతున్న జొన్నా శివశంకర్


మాట్లాడుతున్న ఎం సూర్యనారాయణ

నష్టపరిహారం చెల్లించాలన్నారు. తెలుగు రైతు నాయకులు కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎంక్వైరీ రిపోర్టును పారదర్శకంగా బయట పెట్టాలని కోరారు. పసుపు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మొలకా శివ సాంబి రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి తను పండించిన పంటను కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ చేసుకుంటే అది అగ్ని ప్రమాదానికి గురై రైతులు తీవ్రంగా నష్టపోయారని, తక్షణమే వారికి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం క్వింటాకు 11,750 ఇవ్వాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాలరాజు, బసవయ్య, రామస్వామి, బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, లేనియెడల ఆందోళన చేపడతామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. సంఘం జిల్లా కార్యాలయం వద్ద గురువారం వివిధ శాఖల కాంట్రాక్టు ఉద్యోగులతో సాయంత్రం 5 గంటల తర్వాత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ క్రమబద్ధీకరణ ప్రక్రియ నిదానంగా జరుగుతుందని, మరికొద్ది రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తున్నందున కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరికీ ఎటువంటి షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని కోరారు. టీబి సొసైటీ ఉద్యోగుల్ని రెగ్యులర్ చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులకు క్రమబద్ధీకరణ అందని ద్రాక్షగా మారిందన్నారు. గురుకుల పాఠశాలలో సుమారు 790 మంది కాంట్రాక్టు ఉద్యోగ, ఉపాధ్యాయలను కూడా రెగ్యులర్ చేయాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులకు గత రెండు నెలలుగా జీతాలు పదో తేది తర్వాత జీతాలు ఇస్తున్నారని, ఇకనుండైనా ఒకటో తేదీన జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్వనాథ్, రాంబాబు, రవి కుమార్, ముత్యాలరావు, బషీర్ అహ్మద్, రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.40 లక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని 17వ వార్డులో నిర్మాణంలో ఉన్న రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం తాడేపల్లిలోని కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రజక వృత్తిదారుల సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు కమ్యూనిటీ హాలు శ్లాబు మాత్రమే నిర్మాణం జరిగిందన్నారు. మిగిలిన నిర్మాణాలు జరగాల్సి ఉందని ఎమ్మెల్యే స్థానిక అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం పనులు పూర్తి చేసి కమ్యూనిటీ హాలును ప్రజా వినియోగంలోకి తీసుకొస్తామని ఎంటిఎంసి కమిషనర్ నిర్మల్‌కుమార్ హామీనిచ్చారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం నాయకులు బొజ్జ సుబ్బారావు, పి.శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు, ఆంజనేయప్రసాద్, టి.సాంబశివరావు, యు.దుర్గారావు, పార్థసారధి, ఎం.శివ. పి.కోటేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభలు పెట్టి అబద్దాలు చెబుతున్నారు : మోహనకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



టిడిపి హయంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తే వైసిపి హయంలో విధ్వంసానికి పెద్ద పీట వేశారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకష్ణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరిది అభివృద్ధి పాలనో ఎవరిది విధ్వంసక పాలనో ప్రజలకు తెలుసు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి పై చర్చించేందుకు వైసిపి నాయకులకు దమ్ముందా అని మన్నవ మోహన కృష్ణ ప్రశ్నించారు. జగన్ సిద్ధం సభలు పెట్టి అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఓటమి భయంతోనే ఇప్పటికి 77 నియోజకవర్గాల్లో అభ్యర్థులను మార్చారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పెత్తందారు జగన్‌కు ఐదు కోట్ల ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతుందన్నారు. రాయలసీమలోని 52 నియోజకవర్గాలలో ప్రజలను ఇబ్బందులు పెట్టి ఆర్టీసీ బస్సులను స్కూల్ బస్సులను లాక్కొని జనాన్ని బలవంతంగా సభలకు తరలిస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను రివర్స్ చేసి రైతుల సబ్సిడీలను నిలిపివేసిన జగన్ కు రాయలసీమలో సభలు నిర్వహించడానికి అసలు అర్హత లేదని విమర్శిం చారు.

అంగన్‌వాడీల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

నిరసనప్రదర్శనలు - అధికారులకు వినతులు

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ప్రభుత్వం సంఘాలతో చేసుకున్న ఒప్పందం మేరకు అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి అవసరమైన జీఓలు తక్షణమే విడుదల చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తం పిలుపులో భాగంగా గురువారం జిల్లాలో అంగన్వాడీలు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. గుంటూరులో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీకి వినతిపత్రం అందచేశారు. తొలుత అంగన్‌వాడీలు కలెక్టరేట్ నుండి పీడీ కార్యాలయం వరకూ ప్రదర్శనగా వెళ్లారు. 42 రోజుల సమ్మెకాలం వేతన జిఓ వెంటనే ఇవ్వాలని, హెల్పర్ల పోస్టులకు సంబంధించి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇవ్వాలని, జిల్లాలో అన్ని ప్రాజెక్టుల పరిధిలో ఉన్న సమస్యల



తాడికొండలో నిరసనలో మాట్లాడుతున్న వై నేతాజీ

పరిష్కారానికి తక్షణమే జాయింట్ మీటింగ్ నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ, నగర కార్యదర్శి టి.రాధ, నాయకులు షేక్.బాజీబి, పద్మావతి, సులోచన, శివలీల పాల్గొన్నారు.

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

అంగన్వాడీల మండల సంఘ అధ్యక్షురాలు శివ పార్వతి ఆధ్వర్యంలో పెదనందిపాడు తాసిల్దార్ లాజరస్‌కు వినతిపత్రం అందజేశారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలులో నిరసన ప్రదర్శనలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దండాలక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రత్న మంజుల, దయమ్మ, రాణి, మంజూష, మరియమ్మ, మస్తాన్వలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలిలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ కూడలి వరకు అంగన్వాడీలు ర్యాలి నిర్వహించారు. వారికి సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ ,షేక్ హుస్సేన్ వలి, ఎవిఎన్ కుమారి ప్రసంగించారు.

ప్రజాశక్తి మంగళగిరి: మంగళగిరిలో ఏపీ అంగన్వాడీల యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు నిరసన ప్రదర్శన చేశారు. అంబేద్కర్ సెంటర్ నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, వై కమలాకర్, వేముల దుర్గారావు, హేమలత, మేరీ రోజమ్మ, తబిత, మహేశ్వరి పాల్గొన్నారు.

ప్రజశక్తి-కొల్లిపర : అంగన్వాడీ అండ్ హెల్పర్స్ తమ కోర్కెలు నెరవేర్చాలని నిరసన ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ కోటా చంద్రశేఖర్ ప్రసంగించారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నుండి బస్టాండ్ వరకు అంగన్వాడీలు నిరసన ప్రదర్శన చేశారు.

ప్రజాశక్తి - తాడికొండ : తాడికొండ ఫిబ్రవరి 22 అంగన్వాడీల సమ్మె ముగింపు సందర్భంగా ప్రభుత్వం ఒప్పందం జరిపి నెల కావస్తున్నా, ఒప్పందం మేరకు నేటి వరకు ఎంటువంటి హామీలు అమలు చేయలేదని, వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై నేతాజీ అన్నారు. తాడికొండ చింతచెట్టు సెంటర్ నుండి బస్టాండ్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్ రావు, చింతల భాస్కరరావు, అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు పాల్గొన్నారు.


గుంటూరులో పీడీకి వినతిపత్రం అందచేస్తున్న యూనియన్ నాయకులు



మంగళగిరిలో



చేబ్రోలులో


కొల్లిపరలో



తెనాలిలో



ఫిరంగిపురంలో


పెదనందిపాడులో

సిజిజిబి ఖాతాదారుల బంగారం వెంటనే ఇవ్వండి

ప్రజాశక్తి-క్రోసూరు

దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో అప్రైజర్ నాగార్జున దొంగతనం కారణంగా కనబడకుండా పోయిన బంగారాన్ని ఖాతాదారులకు వెంటనే ఇవ్వాలని, వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరుతూ గురువారం ప్రజా సంఘాలు, సిజిజిబి ఖాతాదారులతో కలిసి దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ సిహెచ్. శ్రీనివాసరావుని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.రవిబాబు మాట్లాడుతూ బంగారం కనబడకుండా పోయి 8 నెలలు దాటిందని, ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే రైతులను పిలిపించి వారికి నష్టపరిహారం చెల్లించే విషయమై చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో బ్యాంకు ముందు ఆందోళన చేస్తామని చెప్పిన నేపథ్యంలో దొడ్లేరులోని బ్యాంకు వద్ద రీజనల్ మేనేజర్‌ని తాము కలిసి నట్లు చెప్పారు.

దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ చిరుమామిళ్ల శ్రీనివాసరావు ప్రజాసంఘాల నాయకులు ఖాతాదారులతో మాట్లాడుతూ దొడ్లేరు సిజిజిబి బ్రాంచ్‌లో బంగారం కనబడకుండా పోయిందని 498 అర్జీలు ఇచ్చారని, అందులో మొదటి దశలో రెన్యువల్ చేసే సందర్భంలో గతంలోని రికార్డును ఆధారం చేసుకుని ఎంక్వయిరీ చేసిన 321 మంది ఖాతాదారులకు గ్రాముకు (నికర బంగారానికి) రూ.6,655 చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని అన్నారు. వారి వివరాలను వారం రోజుల్లో బ్రాంచ్ మేనేజర్ శివశంకర్ రాగానే బ్యాంకులో డిస్‌ప్లే చేసి ఆయా ఖాతాదారులకు నోటీసులు పంపించి నష్టపరిహారం చెల్లించనున్నట్లు చెప్పారు బంగారం కనబడకుండా పోయిందని అర్జీలు పెట్టిన ఖాతాదారుల్లో సుమారు 98 మంది ఖాతాలకు సంబంధించిన ఎటువంటి ఆధారాలు లభించలేదని , వాటిని కూడా రెండవ దశలో పరిశీలిస్తామని చెప్పారు.

వడ్డీ రాయితీ గురించి పై అధికారులతో మాట్లాడతానని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు . అనంతరం ఖాతాదారులతో కలిసి రీజనల్ మేనేజర్‌కి బంగారం కనబడకుండా పోయిన రైతులకు వడ్డీ రాయితీ ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం క్రోసూరు మండల కార్యదర్శి తిమ్మిశెట్టి హనుమంతరావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆవుల ఆంజనేయులు, డి.నటరాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి ముత్యాల పౌలు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుబాని , కోటి,నాగుల్ షరీఫ్, బి.స్రవంతి బాయి, గన్ సైదా , ఎస్.ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.


ఆర్‌ఎం సిహెచ్.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు, ఖాతాదారులు

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని కష్ణా నది ఒడ్డున గల సత్రశాలలో మార్చి 8న నిర్వహించబోయే మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు ఏ విధంగా చేయాలనే దానిపై వివిధ శాఖల అధికారులతో గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సంపూర్ణమ్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కనీసం 25 వేల మంది భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తుంటారని, కృష్ణా నదిలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, అదనపు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయాలని,మద్యం పూర్తిగా నిషేధించాలన్నారు వైద్య ఆరోగ్య శిబిరం, స్నానం చేయడానికి ఏర్పాట్లు, రహదారి మరమ్మతులు తదితర అంశాలపై చర్చించారు.సమావేశంలో ఎంపీడీవో శంకరరావు తహశీల్దార్ ఎస్ః.రామ్మోహన్‌రావు ఎండోమెంట్ ఈవో నెమలిరెడ్డి, ఎస్సై నారాయణరెడ్డి, ఆర్టీసీ డిఎం పిచ్చయ్య , వైద్యాధికారి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

'పదినెలలుగా జీతాల్లేవు'

ప్రజాశక్తి-ఈపూరు

పది నెలలుగా జీతాలు లేక పారిశుద్ధ్య కార్మికుల జీవనం కష్టంగా మారిందని, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం నిరసన చేశారు.ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు కుంటి సాకులు చూపుతూ పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకుండా వేధిస్తున్నారన్నారు.ఎంపీడీవో స్పందించి జీతాలు చెల్లించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల సిపిఐ నాయకులు సత్యానందం, రామారావు, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.



ఆడపిల్లలకు ఉన్నత విద్యపై అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని చెంఘిజ్‌ఖాన్‌పేటలోని ఎంపియుపి పాఠశాల లో 'బేటీ పడావో బేటి బచావో' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జోజమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆడపిల్లలకు ఉన్నత విద్యపై అవగాహన, ఆరోగ్యంపై శ్రద్ధ, బాల్య వివాహాల నిర్మూలన, రక్త హీనత సమస్యలు,దాని నిర్మూలన, సరైన సమతుల్య ఆహార అలవాట్లను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెవి శంకర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శ్రావణి , థామసమ్మ, అంగన్వాడీ టీచర్ పద్మజ పాల్గొన్నారు.

3న పల్స్‌పోలియో ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-క్రోసూరు

మార్చి 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని క్రోసూరు మండల స్థాయి అన్ని శాఖల అధికారులు జయప్రదం చేయాలని క్రోసూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డివిఎస్ రమాదేవి పేర్కొన్నారు గురువారం పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసూరు ఎంపీడీవో కార్యాలయం లోని ప్రజా పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన పల్స్ పోలియో మండల టాస్క్ ఫోర్స్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మం డలంలో మొత్తం 25 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశామని, ముగ్గురు రూట్ ఆఫీసర్లను , రెండు సంచార టీములను నియమించినట్లు వివరించారు. మొత్తం జీరో టు ఐదేళ్లలోపు పిల్లలు 4719 మందికి పోలియో చుక్కలు వేసేం దుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సంచార జాతులు, ఇటుక బట్టీలు, కట్టడాలు, నిర్మాణ స్థలాల్లో పనిచేసే వారికి, వేరే ప్రాంతం నుండి క్రోసూరు మండలానికి మిరపకోతలకు వచ్చిన వ్యవసాయ కూలీల పిల్లలకు, మొబైల్ టీం ద్వారా పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధి కారి శిఖా శాంసన్ మాట్లాడుతూ 3వ తేదీన ఆయా కేంద్రాల్లో పోలియో చుక్కలు వేయు నున్నట్లు చెప్పారు. పోలియో చుక్కలు వేయించ ుకొని మిగిలిన చిన్నారులకు మార్చి 4,5 తేదీల్లో ఇంటింటి పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా వారికి పోలియో చుక్కలు వేస్తారన్నారు. క్రోసూరు లోని అమ రావతి బస్టాండ్ సెంటర్లో పోలియో చుక్కల కేం ద్రం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈవోపిఆర్ డి.శివన్నారాయణ, వైద్య ఆరోగ్యశాఖ సూపర్వైజర్ శివుడు, విద్యుత్ శాఖ ఎంవి సుబ్బారెడ్డి, విద్యాశాఖ అబ్దుల్ సత్తార్ ఐసిడిఎస్ నుండి మెరీనా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారిణి డివిఎస్ రమాదేవి


'వాలంటీర్లకు వందనం' లో వాలంటీర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

'పార్టీలకు అతీతంగా సేవలందించేది వాలంటీర్లు'

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో వినుకొండ రూరల్ మండలం వాలంటీర్లకు 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లకు సేవా రత్న, వజ్ర, మిత్ర అవార్డు పత్రాలను ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వారికి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటర్లది ముఖ్యపాత్ర అని అన్నారు. వాలంటర్ల వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని అన్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైయస్సార్ హెల్త్ సెంటర్ లను నిర్మించి ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో నిర్మూలన చేసే విధంగా సీఎం జగన్మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారని తెలిపారు.



బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాశక్తి-వినుకొండ

ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ ఎం.అనురాధ ఆధ్వర్యంలో వినుకొండ మండలంలోని నరగాయపాలెం సెక్టార్ పరిధిలోని ఉప్పరపాలెం లో బాల్య వివాహాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొజెక్టర్‌పై బాల్య వివాహాలు గురించి వివరించారు. అలాగే, ఇద్దరు పిల్లలతో గుడ్ టచ్ అండ్ బాడ్ టచ్ గురించి డెమో చేయించి చూపించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.నాగరాజుకుమారి బాల్య వివాహాల గురించి క్లుప్తంగా వివరించారు అనంతరం బాల్య వివాహాలపై గ్రామంలో ర్యాలీ నిర్వ హించారు. కార్యక్రమంలో పిల్లలు, బాలింతలు స్కూల్ హెడ్మాస్టర్ బి.యలమందరావు, పి. సుజాత, కె. ఆరోగ్యం, ఎఎన్ఎం ఆజాబీ, సిహెచ్ఒ సామ్రా జ్యం, ఎం. శ్రీదేవి, వై.శైలజ డి. లీలావతి పాల్గొన్నారు

మహిళా హక్కులపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మహిళా హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మండలంలోని తాళ్లూరు ఐసిడిఎస్ సిడిపిఒ స్వర్ణకుమారి అన్నారు. గురువారం పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు,ఎఎన్ఎంలకు మహిళల చట్టాలు, భ్రూణ హత్యలపై అవగాహన కల్పించారు. స్వర్ణకుమారి మాట్లాడుతూ ఈ అంశంపై అందరికీ అవ గాహన కల్పించాలన్నారు. డాక్టర్ ఆదిత్య మాట్లా డుతూ గర్భస్థ శిశువులను నిరోధించటానికి ప్రయత్నించటం చట్ట రీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బెల్లంకొండ మీరయ్య, సూపర్వైజర్ మున్ని పాల్గొన్నారు.



శతాధిక వృద్ధురాలు మృతి



ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడుకు చెందిన శతాధిక వద్ధురాలు పోపూరి తిరుపతమ్మ (102) బుధవారం రాత్రి స్వగృహంలో కన్నుమూశారు. కుమారుడు, కుమార్తె, మను మలు, మను మరాళ్లు, ముదిమనుమలు. ఐదు తరాల సంతానంతో ఆమెకు అనుబంధం ఉంది.

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రజాశక్తి - మాచర్ల



రానున్న ఎన్నికలలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించుకుని స్వేచ్ఛ, భావ ప్రకటన హక్కును పొందాలని టిడిపి ఇన్‌చార్జీ జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని జమ్మలమడక గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ వడితే బాలునాయక్, బాబు నాయక్ తదితరులు వైసిపిని వీడి తెలుగుదేశం పార్టీలో బ్రహ్మారెడ్డి సమక్షంలో చేరారు. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం బ్రహ్మారెడ్డి మాటాడుతూ తమను గెలిపించి ఉపాధి, సంక్షేమ కార్యక్రమాలు అమలుకు నిర్మాణాత్మకమైన ప్రభుత్వానికి స్వాగతం చెప్పాలన్నారు.

భవిత కేంద్రంలో టాయిలెట్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి తెనాలి :స్థానిక బాలాజీ రావు పేటలోని భవితా కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం సౌకర్యవంతమైన మరుగుదొడ్ల నిర్మాణానికి పట్టణంలోని 33 వ వార్డు కౌన్సిలర్ మొగల్ రహమత్ భేగ్ స్పందించారు. మానసిక శారీరక వైకల్యం కలిగిన విద్యార్థులు గతంలో ఉన్న మరుగుదొడ్లతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వారి అవసరాలకు అనుగుణంగా టాయిలెట్స్ నిర్మాణానికి ఆయన ముందుకు వచ్చారు. భవిత కేంద్రం ఆవరణలో గురువారం శంకుస్థాపన చేశారు. వార్డు పరిధిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమస్యను గుర్తించి తన వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా స్పందించినట్లు కౌన్సిలర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, రజని, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సునీల్, నాగభూషణం పాల్గొన్నారు.



టైలరింగ్ శిక్షణ పొందుతున్న వారితో అధికారులు

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో గురువారం తుళ్లూరులో టైలరింగ్‌లో శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది.ఎంపీడీఓ శ్రీమన్నారాయణ శిక్షణా కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ ఎస్ డి సి జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి పిన్నెంటి ప్రణయ్ మాట్లాడుతూ జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అన్ని నియోజక వర్గాల్లో స్కిల్ హబ్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఇంచార్జి ఎస్ జ్యోతిర్మయి, ఏపీఎస్ఎస్ డిసి నాక్ స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ టి రవి,గ్రామ పంచాయతీ కార్యదర్శి టి వెంకటేశ్వరరావు, శిక్షకులు టి ఇందిర పాల్గొన్నారు.



బ్రేక్ ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక బుర్రిపాలెం ఎఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో బ్రేక్ ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతత్వంలో జరిగిన కార్యక్రమంలో తెనాలి పట్టణ 17, 18, 32, 35, 36 వార్డు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్టీ నిర్వహించబోయే కార్యక్రమాలు, అంతర్గత వ్యూహాలపై చర్చలు జరిపారు. పట్టణ కౌన్సిలర్లు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్‌లు, గహ సారథులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, మహిళా నాయకులు , మద్దాలి శేషాచలం, శుభాని, గౌస్, అక్కిదాసు కిరణ్ కుమార్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలి

ప్రజాశక్తి మంగళగిరి :మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకం ఏడు రోజుల ప్రత్యేక శిబిరములో భాగముగా గురువారం రత్నాల చెరువులో వృద్ధులకు ఒకరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆంధ్ర నాటక కళా సమితి ప్రెసిడెంట్ నన్నపనేని నాగేశ్వరరావు మరియు ప్రజా గాయకులు కంచర్ల కాశయ్య మాట్లాడారు. అనంతరం వృద్ధులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి రేఖా నరేష్ బాబు, నిర్మల ఫార్మసీ కళాశాల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి నిర్మల జ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాముల రెడ్డి , సమన్వయ కర్త నరసింహా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పానీపురి బండ్ల నిర్వాహకులకు నోటీసులు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా ఉన్న, పరిశుభ్రత పాటించని పానీపూరి బండ్ల నిర్వహకులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తిచేకూరి స్పష్టం చేశారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం ప్రజారోగ్య అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో పానీపూరి బండ్ల నిర్వహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పలు ప్రాంతాల్లో పానీ పూరి బండ్లు కాల్వల పక్కన, అపరిశుభ్ర వాతావరణంలో విక్రయాలు చేస్తున్నారాని, నగరంలో ప్రస్తుతం అనారోగ్యాలకు రోడ్లపక్క పానిపూరి బండ్లు, అరక్షిత ప్రాంతాల్లో విక్రయిస్తున్న తినుబండారాలు కూడా కారణం కావచ్చుని, అటువంటి వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రీజినల్ ల్యాబ్ జిఎంసికి సూచించిందన్నారు. పానీపూరి బండ్ల నిర్వహకులకు తొలి విడతగా నోటీసులు జారీ



పానీపురి బండ్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న జిఎంసి సిబ్బంది

చేశామని, త్వరలో స్పెషల్ యాక్షన్ ప్లాన్ ద్వారా అనారోగ్యకర వాతావరణంలో ఉండే పానీపూరి బండ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నగరంలో ప్రమాణాలు పాటించకుండా నీటి విక్రయాలు చేస్తున్న 6 మినరల్ వాటర్ ప్లాంట్ లను సీజ్ చేశామని, మరో 56 ప్లాంట్‌లకు నోటీసులు జారీ చేశామన్నారు.

రాజధానిలో పటిష్ట భద్రత

ప్రజాశక్తి - తుళ్లూరు : కాంగ్రెస్ పార్టీ గురువారం చలో సెక్రటేరియట్ కు పిలుపు నిచ్చిన నేపథ్యంలో రాజధాని అమరావతిలో పోలీ సులు పటిష్ట భద్రత చర్యలు చేపట్టారు. ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందంటూ పిసిపి చీఫ్ వైఎస్ షర్మిల చలో సెక్రటేరియట్ కు పిలుపు నిచ్చారు. దీంతో రాజధాని గ్రామాల్లో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. సెక్రటేరియట్ కు వెళ్ళే ప్రధాన మార్గాల్లో బారికేడ్లను ఏర్పాటు చేసి విస్తృత తనిఖీలు చేశారు. సెక్రటేరియట్‌కు వెళ్ళే ఆర్టీసి బస్సులను సైతం మల్కాపురం జంక్షన్‌వద్ద నిలిపివేశారు. దీంతో సెక్రటేరియట్ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు నడవాల్సివచ్చింది.

పోలీసుల అదుపులో కాంగ్రెస్ పార్టీ నాయకులు

బుధవారం రాత్రి నుంచే రాజధాని ప్రాంతంలోని కాంగ్రెస్ నాయకులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. కాంగ్రెస్స్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ మెండెం కోటేశ్వరరావును, నల్లపాడు పోలీస్ స్టేషన్ కు, వెలగపూడికి



రాజధానిలో మోహరించిన పోలీసులు

చెందిన కంచర్ల గాంధీని తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. వీరిని గురువారం మధ్యాహ్నం తరువాత విడిచిపెట్టారు. **తాడికొండ :** సచివాలయం ముట్టడి కి అనుమతులు లేవంటూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ లియాకత్ అలీ, కాంగ్రెస్ పార్టీ యువ జన నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ రహమతుల్లాని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **ప్రజాశక్తి మంగళగిరి :** వైఎస్ షర్మిల సచివాలయ ముట్టడికి పిలుపు సందర్భంగా యువజన కాంగ్రెస్ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాయి సుధీర్ ను నాయకులు కంతేటి సాగర్,గోలి సాంబశివరావు, చిలకా కార్తీక్, రాధిక లను కూడా హౌస్ అరెస్ట్ చేసి నోటీసులు అందజేశారు.

ముమ్మాటికీ కక్ష పూరిత వైఖరే

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతి పై వైసిపి ప్రభుత్వానిది ముమ్మాటికీ కక్ష పూరిత వైఖరేనని రైతులు, మహిళలు అన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు గురువారంతో 1528వరోజుకు చేరాయి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది, అమరావతి ఉద్యమానికి సంబంధించిన పలు కీలకమైన కేసుల్లో సుప్రీంకోర్టులో రైతుల తరుపున బలమైన వాదనలు వినిపించిన పాలీ నారీమణ్ మరణానికి చింతిస్తూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ప్లంబర్లు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

ప్రజాశక్తి తెనాలి :కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనిస్తూ, ప్రజల అభిరుచులకు అనుగుణంగా ప్లంబర్లు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అరుణ జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ అధినేత కొత్త శేషు కుమార్ అన్నారు. స్థానిక సుల్తానాబాద్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ కుమార్ పంప్స్ ఆవరణలో గురువారం మెగా ప్లంబర్స్ మీట్ నిర్వహించారు. పట్టణంతోపాటు పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్న ప్లంబర్స్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్వార్ష్ పెరల్ ఏపీ ఇంచార్జ సాయి స్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ స్వదేశీ పరిజ్ఞానంతో గృహావసరలకు అవసరమైన పైప్స్ మొదలు అన్ని రకాల వాటర్ వర్క్స్ సామాగ్రి ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. ప్లంబర్లు అడిగిన సందేహాలను వారు నివృతి చేశారు.

జెఎంజెలో సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి తెనాలి

స్థానిక జెఎంజెలో మహిళా కళాశాలలో అంతర్ కళాశాలల సాంస్కృతిక ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈనెల 27 వరకు జరిగే ఉత్సవాలను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గాదె థెరేసమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద, కల్చరల్ కమిటీ కన్వీనర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం తరగతి గదిలో విద్యకు మాత్రమే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని మానసికంగా నిత్య నూతనోత్సాహాన్ని పొందాలన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ వారం రోజుల పాటు కళాశాలలో కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ విభాగాల నుండి కల్చరల్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు డా పి జన్నిమ్మ, డా సరళా దేవి, యోజిత, కరీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

శివారాత్రి ఉత్సవాలకు భారీ ప్రభలు ఏర్పాటు

ప్రజాశక్తి - చేబ్రోలు :మహాశివరాత్రి పర్వదినం వడ్లమూడి క్వారీ బాల కోటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించే ఉత్సవాలకు భారీ విద్యుత్ ప్రభల నిర్మాణ పనులను ఆలయ సమీప గ్రామాలలో ప్రజలు ప్రారంభించారు. త్వరలో జరగనున్న ఈ ఉత్సవానికి నారాకోడూరు తెనాలి రోడ్డులో భారీ ఎత్తైన విద్యుత్ ప్రభ తో పాటు మరో 3 ప్రభలు గ్రామం లో సిద్ధమవుతున్నాయి. మండలంలోని గొడవర్రు, గుండవరం నారాకోడూరు, వేజెండ్ల, సుద్దపల్లి, చేబ్రోలు గ్రామాల నుండి భారీ నిర్మాణాలతో దేదీప్యమైన వెలుగులతో విద్యుత్ ప్రభలు ఆలయానికి వస్తాయి. విద్యుత్ ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయనటంలో సందేహమే లేదు.

ఆలపాటి పెళ్లికానుక అందజేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్ :తెనాలి నియోజకవర్గ పరిధిలో మాజి మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అందిస్తున్న పెళ్లికానుక ప్రజాదరణ పొందింది. ఈ కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణ 17వ వార్డుకు చెందిన షేక్ జాని, హసీనా దంపతుల కుమార్తె సానియా అలాగే పట్టణ 7వ వార్డుకు చెందిన షేక్ సుభాని, సాహిదా దంపతుల కుమార్తె బాజిబి వివాహం సందర్భంగా సోమవారం వధువులు ఇరువురికి ఉంగరాలు అందజేశారు. స్థానిక టిడిపి నాయకులు చీర, సారె ను సంప్రదాయంగా అందించారు.

ఓటు నమోదుపై ఎన్నారై కళాశాలలో అవగాహన

ప్రజాశక్తి -మేడికొండూరు : మేడికొండూరు మండలం విషదల అడ్డ రోడ్డు వద్ద గల ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఓటు నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తహశీల్దార్ కోనూరి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఓటు ఎంతో విలువైనదని తెలిపారు. ఎన్నారై ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు నమోదు ఎలా చేసుకోవాలో వివరించారు. ఎలాంటి ప్రభావాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమాజాన్ని ఉపయోగపడే వారిని ఎన్నుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ శ్రీహరి రావు. ఏవో సీతారామయ్య, పలు విభాగాల హెచ్వోడీలు, పలువురు అధ్యాపక సిబ్బంది, పాల్గొన్నారు



క్వారీ తిరుణాళ్లకు ఘనంగా ఏర్పాట్లు

అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే కిలారు రోశయ్య

ప్రజాశక్తి- చేబ్రోలు

అధికారులు సమన్వయంతో క్వారీ తిరుణాళ్లకు ఘనంగా ఏర్పాటు చేయాలని, యాత్రికులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని ఎమ్మెల్యే కిలారు రోశయ్య తెలిపారు. గురువారం చేబ్రోలు క్వారీ దగ్గర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు తిరుణాళ్లలో మంచినీటి వసతి, మరుగుదొడ్లు, శానిటేషన్ ఏర్పాట్లు, షాపులు, వాహనాల పార్కింగ్ సక్రమంగా నిర్వహించాలన్నారు. పశువులు గుడి ప్రదక్షిణాలకు సంబంధించి రెండు రోజుల ముందు, వాహనాల ప్రదక్షణలు ఒకరోజు ముందుగా నిర్వహించుకునే విధముగా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు సమర్ధవంతంగా నిర్వహించాలని పోలీస్ అధికారులకు, ఆర్టీసీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమావేశంలో డి ఎల్ పి ఓ స్వరూప రాణి, ఇన్చార్జి ఎంపీడీవో జి శ్రీనివాసరావు, పొన్నూరు రూరల్ సీఐ వై కోటేశ్వరరావు, ఎస్ఐ పి మహేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి వై పి ఏ ప్రసాద్, ఆలయ ఈవో రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న బద్రావతి సమేత భావనారుషి స్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణ పద్మశాలియ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరి శ్రీ దామర్ల నాంచారమ్మ ప్రాంగణంలో నిర్మించిన శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట, మరియు శ్రీ గణపతి స్వామి,శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారు, శ్రీ సరస్వతి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట, కలశ ప్రతిష్ట, దేవాలయం ధ్వజస్తంభ ప్రతిష్ట ఈనెల 29వ తేదీన జరుగుతుందని పట్టణ పద్మశాలియ బహుత్తమ సంఘం ప్రతినిధులు గురువారం జరిగిన కార్యక్రమంలో తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ పద్మశాలియ బహుత్తమ సంఘం అధ్యక్షులు చింతకింది కనకయ్య, ఉపాధ్యక్షులు గుత్తికొండ ధనంజయరావు, ప్రధాన కార్యదర్శి దామర్ల కుబేర స్వామి, కోశాధికారి గంజి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలకు ఎపి కౌలురైతు సంఘం వినతి

ప్రజాశక్తి మంగళగిరి : పిఎసిఎస్‌లో కౌలు రైతులకు సభ్యత్వం ఇచ్చి పంట రుణ సదుపాయాలు కల్పించాలని, పెట్టుబడి సాయం రూ.15వేలు అందజేయాలని, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించలని ఎపి కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి జమలయ్య, జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, నాయకులు చిన్న తిరుపతయ్య తదితరులు కాంగ్రెస్‌పార్టీ నేత వైఎస్ షర్మిలకు వినతి పత్రం అందజేశారు. మెగా డిఎస్‌సి కార్యాక్రమంలో అరెస్టు అయి మంగళగిరి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న షర్మిలను రైతు సంఘం నాయకులు కలిశారు. జమలయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కౌలు రైతులు, కవులు దోపిడీ, మార్కెట్ దోపిడీ, వడ్డీ దోపిడీ, అధిక ధరల దోపిడీకి, గురవుతున్నారన్నారు.

జామాయిల్ కలప వేలం నిలిపేయాలని వినతి

జామాయిల్ కలప వేలంలో మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు అమ్మడం వలన ధరలు పతనమై రైతులు తీవ్రంగా నష్టపోతారని, వేలాన్ని నిలుపుదల చేయాలని, ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ వై మధుసూదన్ రెడ్డికి గురువారం వారి కార్యాలయంలో సామాజిక వన రైతుల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి హనుమారెడ్డి, నాయ కులు కార్యదర్శి పి జమలయ్య, కే వీరారెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు తిరుపతి డివిజన్లో జామాయిల్ కడప వేలంలో మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు అమ్మకంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జామాయిల్ కడప వేలంలో కొందరు గుత్తేదారులు సిండికేట్‌గా మారి కారు చౌకగా టెండర్లు దక్కించుకున్నారని, నెల్లూరు, తిరుపతి, పల్నాడు జిల్లాలలో సంస్థ ద్వారా నిర్వహించిన వేలంలో కేవలం ముగ్గురు మాత్రమే వ్యాపారులు పాల్గొనడం వారు సిండికేట్‌గామారడానికి నిదర్శనమన్నారు.

నేడు 10 ఆర్‌యూబిలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

డివిజన్ పరిధిలో 13 రైల్వేస్టేషన్‌ల అభివృద్ధిపై శుక్రవారం గుంటూరు రైల్వే డివిజన్ కార్యాలయంలో ఆయా స్టేషన్ మేనేజర్‌లతో డిఆర్‌ఎం రామకృష్ణ సమీక్షించనున్నారు. అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్ల అభివృద్ధితో పాటు 10 ప్రాంతాల్లో నిర్మించిన ఆర్‌యూబిలను జాతికి అంకిత చేయనున్నారు.

కెఎల్‌పి స్కూల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు



రాబర్ట్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ వై.రథినీ చౌదరి సర్ రాబర్ట్ బెడెన్ పవల్ చిత్రపటానికి నివాళి అర్పించారు. సెక్రెటరీ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులలో క్రమశిక్షణను, సామాజిక స్పృహను, దేశభక్తిని సేవాతత్పరతను పెంపొందించటానికి దోహద పడుతుందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరాలని సూచించారు.

చలపతి ఫార్మసీలో ముగిసిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి-గుంటూరు



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ సహకారంతో చలపతి ఫార్మసీ కాలేజిలోని ఎన్ఎస్ఎస్ విభాగం వారు లాం, తాతిరెడ్డిపాలెం గ్రామాల్లో వారం రోజులపాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు గురువారం ముగిశాయి. ప్రజలకు, విద్యార్థులకు ఓటుహక్కు ప్రాధాన్యత, మాదక ద్రవ్యాల వల్ల నష్టాలు, ఉచిత వైద్యశిబిరం, మొక్కలు నాటటం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారని, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు తెలిపారు. చివరి రోజు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యా లయం పరిసరాలు, పలు వీధులను శుభ్రం చేశారు.

పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేసిన ఆరోగ్య శాఖ కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ నివాస్

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్ గురువారం స్థానిక ఎల్.బి.నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. నివాస్ స్వయంగా రక్త పరీక్షలు చేయించుకొని, పరీక్షల నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, డిపిఎంఒ డాక్టర్ సిహెచ్.రత్నమన్మోహన్, డిపిఒ సైమన్‌రాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

యువత సేవాభావాలు కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు



క్యాంప్‌లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

గుంటూరు మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-3 వారు నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగ ంగా గురువారం ప్రాథ మిక పాఠశాలలో పిల్లలకు చదువు ప్రాధా న్యత గురించి వివరించారు. వారంరోజులపాటు నిర్వహించిన ఈ శిబిరంలో మొక్కలు నాటడం, స్వచ్ఛత సేవా, వైద్య శిబిరం, సరైన జీవనవిధానం గురించి, శుభ్రత గురించి అవగాహనా ర్యాలీ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధిగా గుంటూరు జాతీయ సేవా పథకం నిర్వహణ అధికారి డాక్టర్.జె.వి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ నేటి కాలంలో ముఖ్యంగా యువత చదువుతో పాటు, సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో 21వ వార్డు కార్పొరేటర్ కె.గురవయ్య, కార్యక్రమ నిర్వహణ అధికారి కె.సుబ్బరత్తమ్మ, కళాశాల ప్రిన్సిపాల్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్. వి.ఆర్. జ్యోత్స్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సిఎంఎ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుంటూరు



ప్రెస్‌మీట్‌లో వివరాలు వెల్లడిస్తున్న మోహన్

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సిఎంఎ ఫలితాలలో మాస్టర్‌మైండ్స్ అఖిల భారత స్థాయిలో ప్రభంజనం సృష్టించారని మాస్టర్‌మైండ్స్ అడ్మిన్ అడ్వైజర్ మోహన్ తెలిపారు. సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో మొదటి 50 ర్యాంకులలో ఆలిండియా 5వ ర్యాంకుతోపాటు, ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 49 మంది ఉన్నారన్నారు. సిఎంఎ ఫైనల్ ఫలితాలలో ప్రకటించిన మొదటి 50 ర్యాంకులలో ఆలిండియా 2వ ర్యాంకుతోపాటు, ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 34 మంది ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను మోహన్ అభినందించారు.

పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : జిల్లాలో ఇంటర్మీడియట్, పదవ తరగతి, టెట్, డీఎస్సీ పరీక్షలు సజావుగా నిర్వహించే ందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, ఇంటర్మీడియట్ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఇంటర్, టెన్త్, టెట్, డీఎస్సి పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గుంటూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్, 10వ తరగతి, డీఎస్సి, టెట్ పరీక్షల నిర్వహణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మార్చి 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలకు, మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే పదవ తరగతి పరీక్షల కోసం ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పరీక్షలను తనిఖీ చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలని, ఫ్యాన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని, పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షలు జరిగే రోజు 100 మీటర్లలోపు ఉండే జిరాక్స్ సెంటర్లను బంద్ చేయించాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాలలో ఫస్ట్ ఎయిడ్ కిట్ తో పాటు ఒక నర్సును ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాలను సెల్ ఫోన్ ఫ్రీ జోన్ గా ప్రకటించడం జరిగిందని, కావున ఏ సిబ్బంది కూడా సెల్ ఫోన్ లను ఉపయోగించరాదన్నారు. సమావేశంలో డిఆర్ఒ పెద్ది రోజా, ఇంటర్ ఆర్ఐఒ జి.కె.జుబేర్, డిఇఒ శైలజ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్‌లో అంతర్జాతీయ కవలల దినోత్సవం

ప్రజాశక్తి తెనాలి



కవలలతో ఎండి మురళి కాంత్ దాసరి

అంతర్జాతీయ కవలల దినోత్సవాన్ని స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూనికేతన్ విద్యాసంస్థలో గురువారం నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న ఎనిమిది జతల కవలలను మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి గులాబీలతో ప్రత్యేకంగా అభినందించారు. వారితో మాట్లాడారు. కవలల పరస్పర అభిప్రాయాలు, వారి అలవాట్లు తెలుసుకున్నారు. ఒకే వేదికపై ఒకే పోలికలు ఉన్న ఎనిమిది జతల కవలలను పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మురళీ కాంత్ దాసరి మాట్లాడుతూ పాఠశాలలో మొత్తం పది జతల కవలలు ఉన్నారని, వారిలో ఎనిమిది జతలు హాజరయ్యారని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అధికారులతో మేయర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

గుంటూరు నగరపాలక సంస్థ 2024-25 సంవత్సరానికి తయారు చేసిన బడ్జెట్ గుంటూరు నగరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు అన్నారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌పై మేయర్ అధ్యక్షతన గురువారం ఆయన చాంబర్‌లో జిఎంసి విభాగాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిఎంసి ఆదాయ, వ్యయాలు, బడ్జెట్ అంచనాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా గుంటూరు నగరం సమగ్రంగా అభివృద్ధి చెందేలా, ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా కృషి చేస్తామని, గుంటూరు నగరాభివృద్ధే ధ్యేయంగా 2024-25 సంవత్సర బడ్జెట్ రూపొందించినట్లు చెప్పారు. జిఎంసి ఆదాయం పెంపుదలకు, కొత్త ఆదాయ మార్గాల అన్వేషణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదాయంలో అధిక భాగం ఆస్తి పన్ను వసూళ్ల ద్వారా వస్తుందని తెలియచేశారు. బడ్జెట్లో తాగునీరు, పారిశుధ్యం తో పాటు నగరంలో పచ్చదనం పెంపుకు, రోడ్ల విస్తరణకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి కమిషనర్లు సి.హెచ్ శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, ఈఓఎ నాగేంద్రకుమార్, ఈ.ఈ సురేందర్‌రెడ్డి, సి.పి ప్రదీప్‌కుమార్, యం.హెచ్.ఓ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

విఐటిలో వి-టాప్ టెక్‌ఫెస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి - తుళ్లూరు



మాట్లాడుతున్న డాక్టర్ చంద్ర శేఖర్

రాజధాని అమరావతిలోని విట్ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల వి - టాప్ ' 2024 ఫెస్ట్ ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ కో అర్డినేటింగ్ ఆఫీసర్ బుద్ధ చంద్రశేఖర్, ఐబిఎం ఇన్నోవేటివ్ సెంటర్ డైరెక్టర్ విఠల మద్యాల్కర్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థల నుండి విద్యార్థులు టెక్నికల్ ఫెస్ట్ లో పాల్గొన్నారు. 'జ్ఞానాన్ని వర్తింపజేయండి, జీవితాన్ని మెరుగుపరచండి' అనే నినాదంతో ఈ ఫెస్ట్ ప్రారంభమైంది. ముఖ్య అతిధి డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానం విద్య యొక్క ప్రపంచీకరణను ప్రోత్సహిస్తుందని, భారతదేశాన్ని ఒక ప్రముఖ ప్రపంచ నాలెడ్జ్ హబ్‌గా నిలబెడుతుందని చెప్పారు. విఐటి విశ్వవిద్యాలయం తన అంతర్జాతీయ టెక్ ఫెస్ట్,వి - టాప్ ద్వారా విద్యార్థుల సాంకేతిక నైపుణ్యాలు గణనీయంగా పెంపొందించేలా వీలు కల్పిస్తుందని కొనియాడారు. విఠల్ మద్యాల్కర్ మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేటి సాంకేతిక ప్రపంచంలో మారుతున్న సాంకేతికత విజ్ఞానాన్ని సంపాదించటం విద్యార్థులకు అత్యవసరంగా మారిందని, సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వేగంగా చెయ్యవచ్చని అన్నారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటా రెడ్డి మాట్లాడుతూ ఫెస్ట్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ శిబి చక్రవర్తి సేతురామన్ డాక్టర్ హరికిషన్ కొండవీటి, డాక్టర్ సుధా ఎల్లిసన్ మాతే తదితరులు పాల్గొన్నారు.

నేటితో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి : మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న లే అవుట్లలో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్లను ఈ నెల 23వ తేదీలోపు నూరు శాతం పూర్తి చేయాలని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు నోడల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిఎంసి నోడల్ అధికారులతో మేయర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తొలుత నోడల్ ఆఫీసర్ల వారీగా, సచివాలయాల వారీగా ఎన్ని రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో సుమారు 66 వేల ఇళ్ళ పట్టాలను లబ్ధిదారులకు అందజేయటం జరిగిందని, వాటిలో ఇప్పటికే చాలావరకు రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయని, మిగిలిన వాటికి కూడా త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సదరు కార్యక్రమంలో యస్.ఈ సుందర రామి రెడ్డి, నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.